సాక్షి ఒడిశా
శనివారం । 23 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,12,344
బంగారం 1 గ్రాము 500 మిల్లీ గ్రాములు
వెండి 76 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

శుభములివ్వు.. విఘ్నేశ్వర



గణపతి నవ రాత్రులు అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శుక్ర వారం భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు.

- 8లో



స్పీకర్‌గా ప్రమీలా మల్లిక్

రాష్ట్ర శాసనసభ తొలి మహిళా స్పీకర్‌గా బిజూ జనతా దళ్ సీనియర్ నేత ప్రమీలా మల్లిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- 8లో

న్యూస్‌రీల్

స్పీకర్‌కు సీఎం శుభాకాంక్షలు



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుక్రవారం నుంచి ప్రారంభమైన శాసన సభ వర్షాకాల సమావేశాలకు ప్రత్యక్షంగా హాజరయ్యారు. కొత్తగా ఎన్నికైన స్పీకర్ ప్రమీలా మల్లిక్‌తో కలిసి అడుగులు వేసుకుంటూ పోడియం చేరుకుని గౌరవనీయమైన స్పీకర్ ఆసనంపై ఆమెని కూర్చొబెట్టారు. ముఖ్యమంత్రితో విపక్ష నేత జయ నారాయణ మిశ్రా, కాంగ్రెసు శాసన సభ నాయకుడు నర్సింగ మిశ్రా కూడా వెళ్లారు. రాష్ట్ర శాసన సభలో మొదటి మహిళగా స్పీకరు బాధ్యతలు స్వీకరించిన ప్రమీలా మల్లిక్‌కు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

– భువనేశ్వర్

రూ.2.60 లక్షల నగదు చోరీ



బాధితుడు ప్రతాప్ మండంగి

రాయగడ: స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్ వెనుక ఒక ప్రభుత్వ ఉద్యోగి నుంచి గుర్తు తెలియని దుండగులు నగదు దోచుకున్నారు. ఐఐసీ కమలా కాంత్ కుహారో తెలిపిన వివరాల మేరకు.. కొలనార వాటర్ షెడ్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ మండంగి అనే వ్యక్తి జేకేపూర్ ఎస్‌బీఐ నుంచి గురువారం రూ.2.60 లక్షల నగదు విత్‌డ్రా చేశాడు. ఆ మొత్తాన్ని కార్మికుల వేతనాలు చెల్లించేందుకు బైకుపై వస్తుండగా కొమట్లపేట వద్ద గుర్తు తెలియని వ్యక్తి లిఫ్ట్ అడిగాడు. దీంతో బైక్ ఆపి అతడిని ఎక్కించుకొని రాయగడకు బయల్దేరాడు. ఈ క్రమంలో స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్ వెనుక కాస్త దింపమని ప్రాధేయపడ్డాడు. దీంతో బైక్‌పై ఎక్కిన వ్యక్తిని దింపేందుకు ప్రతాప్ మండంగి గోడౌన్ వెనుకకు వెళ్లాడు. అయితే అప్పటికే అక్కడ ఉన్నటువంటి మరో ఇద్దరు వ్యక్తులు, బైక్ లిఫ్ట్ అడిగిన వ్యక్తితో కలిసి ప్రతాప్ వద్దనున్న డబ్బులు ఇవ్వాలని భయపెట్టారు. అనంతరం నగదు దోచుకొని వెళ్లారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీసీ కెమేరాలు ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



మాచ్‌ఖండ్ పోలీసులకు పట్టుబడిన గంజాయి



బొయిపరిగుడ పోలీసులకు గంజాయితో పట్టుబడ్డ కార్తీక ఖిలో

జయపురం: కొరాపుట్ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. అరికట్టేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, గంజాయి అక్రమ రవాణా ఆగడం లేదు. గురువారం జిల్లాలోని బొయిపరిగుడ, మాచ్‌ఖండ్ పోలీసులు రెండుచోట్ల దాదాపు 353 కేజీల గంజాయి పట్టుకున్నారు. బొయిపరిగుడ పోలీసులు బైక్‌పై 60 కేజీల గంజాయిని తరలిస్తున్న ఒక యువకుని అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అరెస్టైన యువకుడు బొయిపరిగుడ సమితి దసమంతపూర్ పంచాయతీ పొడైయిగుడ గ్రామానికి చెందిన కార్తీక ఖొర(27)గా పోలీసులు నిర్ధారించారు. అలాగే మాచ్‌ఖండ్ పోలీసులు గురువారం రెండుచోట్ల దాడులు జరిపి 293 కేజీల గంజాయి పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్టైన వ్యక్తులు ఎమిలిగుడ గ్రామానికి చెందిన తాపస దేవాశిష్ బిశ్వాల్(32), అభిషేక్ రాజా చెతి(29), మల్కన్‌గిరి జిల్లాకు చెందిన మధు ఖొర(35)లుగా వెల్లడించారు. నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్ నుంచి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి గంజాయి తీసుకెళ్తుండగా పోలీసుల చేతికి చిక్కారు. నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

సభా సమయం

- శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభం
- రూ.28,200 కోట్లతో అనుబంధ బడ్జెట్
- 8 రోజులు జరగనున్న సమావేశాలు



స్పీకర్‌కు అనుబంధ బడ్జెట్ ప్రతిని సమర్పిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి విక్రమ కేశరి అరూఖ్

భువనేశ్వర్: రాష్ట్రంలో శాసన సభ వర్షాకాల సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శాసన సభలో 2023–24 ఆర్థిక సంవత్సరపు అనుబంధ బడ్జెట్ ప్రవేశపెట్టారు. దీని పరిమాణం 28 వేల 200 కోట్ల రూపాయలుగా ఆర్థిక శాఖ మంత్రి విక్రమ్ కేశరి అరూఖ్ తెలిపారు. ఈ అదనపు బడ్జెట్‌లో పంచాయతీరాజ్, తాగునీటి శాఖకు రూ.4,083 కోట్లు కేటాయించారు. విపత్తు నిర్వహణకు రూ.4,698 కోట్లు, పాఠశాలలు - సామూహిక విద్యకు రూ.2,882 కోట్లు కేటాయించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.4,067 కోట్లు, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1,327 కోట్ల నిధులను అనుబంధ బడ్జెట్‌లో కేటాయించారు. షెడ్యూల్డ్ కులాలు మరియు తెగల అభివృద్ధికి రూ.1,355 కోట్లు, మిషన్ శక్తి నిర్వహణకు రూ.783 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.897 కోట్ల కేటాయించినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం కోసం రూ.210 కోట్లు, మధుబాబు పించను పథకానికి రూ.500 కోట్లు, ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనకు రూ.555 కోట్లు, ఒడిశా ఆదర్శ విద్యాలయాలు కోసం రూ.106 కోట్లు, స్మార్ట్ సిటీ యోజనకు రూ.100 కోట్లు, అమ్మొ ఒడిశా నవీన్ ఒడిశాకు రూ.1,032 కోట్లు ప్రతిపాదించారు. అనుబంధ బడ్జెట్ సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభను సోమవారం వరకు స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు.

దివంగతులకు సంతాపం

వర్షాకాల సమావేశాలు ప్రారంభం పురస్కరించుకుని దివంగత నాయకులకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా సభ్యులంతా కాసేపు సభలో మౌనం పాటించారు. మాజీ స్పీకర్ దివంగత సూర్య నారాయణ్ పాత్రో, మాజీ సభ్యులు త్రిలోచన్ కనుంగో, రమేష్ సోరెన్, నివేదిత ప్రధాన్, కుమార్ బెహెరా, 49 నేషనల్ రైఫిల్స్ మాజీ–లాన్స్ నాయక్ దేవాశిష్ బిశ్వాల్, 60 సీఆర్పీఎఫ్ బెటాలియన్ మాజీ కానిస్టేబుల్ (జీడీ) సుశాంత్ కుమార్ ఖుంటియా, ఒడిశా పోలీస్ మాజీ కానిస్టేబుల్ సుశాంత్ కుమార్ మహంతి మరియు ఇతర ఒడిశా పోలీసు సభ్యుల మృతిపై సంతాపం తెలియజేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. శాసన సభ ప్రతిపక్ష నేత జయ నారాయణ మిశ్రా, కాంగ్రెస్ శాసన సభ నర్సింహ మిశ్రా సంతాప ప్రతిపాదనకు మద్దతు పలికారు. దివంగత సభ్యులు మరియు అమరవీరుల గౌరవార్థం తొలి విడత సభా కార్యక్రమాలు సాయంత్రం 5 గంటలకు వరకు వాయిదా వేశారు. అనంతరం 2023 – 24 ఆర్థిక సంవత్సరం అనుబంధ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి విక్రమ్ కేశరి అరూఖ్ సభలో ప్రవేశపెట్టారు. షెడ్యూల్ ప్రకారం ఈనెల 28, 30 తేదీల్లో వ్యయ మంజూరి చర్చ, అక్టోబర్ 3న అప్రోప్రియేషన్ బిల్లును సమర్పించి ఆమోదించనున్నారు. శుక్రవారం ప్రారంభమైన రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు అక్టోబర్ 4వ తేదీ వరకు ఎనిమిది పనిదినాలతో కొనసాగుతాయి.

తుఫాన్‌పై స్పష్టత లేదు

- ఐఎండీ డీజీ మృత్యుంజయ్ మహాపాత్రో

భువనేశ్వర్: వచ్చే నెలలో బంగాళాఖాతంలో తుఫాన్ ఏర్పడే అవకాశం ఉందని వెలువడుతున్న ఊహాగానాలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్రో స్పందించారు. రానున్న అక్టోబర్ మొదటి వారంలో అల్పపీడనం ఏర్పడవచ్చు కానీ తుపానుగా ఉద్ధృతమయ్యే సంకేతాలు స్వల్పంగా ఉన్నాయని వివరించారు. బంగాళాఖాతంలో తుపాను అలజడి అంచనాలకు అనువైన సమయం ఆసన్నం కాలేదన్నారు. సకాలంలో తుపాను సంకేతాలు, తాకిడి, తీవ్రత వగైరా సమాచారం ప్రసారం చేయడం జరుగుతుందన్నారు. సాధారణంగా ఒడిశాకు అక్టోబర్ నెల తుఫాన్ పీడిత నెలగా పేరొందింది. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనం మరియు తుఫాను ఏర్పడుతుంది. ఇవి పశ్చిమ–వాయువ్య దిశలో ఆంధ్రప్రదేశ్ మరియు ఒడిశా వైపు కదులుతాయి. అయితే ప్రస్తుతం తుఫాన్ కదలికను నిశితంగా గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. సైక్లోనిక్ సర్క్యులేషన్ ఏర్పడిన క్షణం, చిత్రం స్పష్టం అవుతుందని వెల్లడించారు.

ప్రస్తుతానికి సంకేతాలు శూన్యం

ప్రస్తుతానికి ఒడిశా లేదా మరే ఇతర రాష్ట్రానికి ఐఎండీ తుఫాన్ హెచ్చరికలు జారీ చేయలేదు. తుఫాన్ గురించి ఎటువంటి అంచనా వేయలేదని డైరెక్టర్ జనరల్ స్పష్టం చేశారు. ఐఎండీ అంచనా ప్రకారం అక్టోబర్ మొదటి వారంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. ఇది డిప్రెషన్‌గా తీవ్రతరం అయ్యేందుకు అవకాశాలు తక్కువగా ఉన్నట్లు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తుఫాన్ పశ్చిమ–వాయువ్య–పశ్చిమ దిశలో కదిలే అవకాశం ఉంది. అయితే ఇది తీరానికి ఎప్పుడు తాకుతుందో మరియు దాని ప్రభావంపై ఐఎండీ ఎటువంటి అంచనా వేయలేదు. ఇప్పట్లో అంచనాలు అతి తొందరపాటు చర్య అవుతుందని తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో ఆవిర్భావం విభాగం పరిశీలనలో ఉంది. ఈ పరిస్థితిపై నిరంతరం నిఘా ఉన్నట్లు డీజీ తెలిపారు. సకాలంలో తగిన సమాచారం ప్రసారం అవుతుందన్నారు. ఏడాదిలో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఒడిశాలో తుఫాన్ కాలంగా పరిగణించబడుతుందని పేర్కొని వ్యాప్తి చెందుతున్న పుకార్లను నమ్మవద్దని, ఐఎండీ తరచూ జారీ చేస్తున్న తాజా సమాచారంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

దెబ్బతిన్న ఘాట్ రోడ్



రోడ్ కూలిపోవడంతో నిలిచిన బస్సు

- రాకపోకలకు తీవ్ర అంతరాయం

బరంపురం: గంజాం–కొండమాల్ మధ్య కళింగా ఘాట్ రోడ్ కుప్పకూలింది. బంగాళాఖతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విపరీతంగా కురిస్తున్న వర్షాలతో రహదారి దెబ్బతింది. దీంతో అధికారులు రహదారిని సీజ్ చేశారు. ఫలితంగా బరంపురం, అస్కా పట్టణంకు వెళ్లే వందలాది వాహనాలు నిలిచిపోయాయి. సురడా పోలీసులు దగ్గరుండి బంజనగర్ మీదుగా పుల్బణి వైపు దారి మళ్లించారు. ఘాట్ రోడ్‌పై కేవలం ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. రహదారి మరమ్మతులు పూర్తవ్వడానికి మరో నాలుగు రోజులు పట్టవచ్చని పేర్కొన్నారు.

నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నకిలీ సామగ్రి



నకిలీ మద్యం తయారు చేస్తున్న దృశ్యం

బరంపురం: గంజాం జిల్లా పట్టపూర్‌లో నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసిన ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా తెలిపిన వివరాలు మేరకు.. పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి ఘటకేశ్వరి గ్రామ శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం తయారు చేస్తున్నారు. దీంతో కర్మాగారంపై గంజాం జిల్లా ఎక్సైజ్ మరియు డ్రగ్ అధికారులు దాడులు చేపట్టి నకిలీ మద్యం సామగ్రి, యంత్రాలు, నకిలీ లేబుల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి ప్రశ్నిస్తున్నట్లు వెల్లడించారు.

25 నుంచి తిరోగమన రుతుపవనాలు

- రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు: ఐఎండీ

భువనేశ్వర్: రుతు పవనాల తిరోగమనానికి అనుకూల వాతావరణం నెలకొంది. ఈనెల 25వ తేదీ నుంచి రుతుపవనాలు వెనుదిరిగే అవకాశం ఉంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాల ఉపసంహరణకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) జారీ చేసిన సమాచారం ప్రకారం ఝార్సుగుడ, సుందర్‌గడ్, కెంజొహర్, కొరాపుట్ మరియు నవరంగపూర్, మల్కన్‌గిరి ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు చోట్ల శనివారం ఉదయం 8.30 వరకు భారీ వర్షాలు (7 నుంచి 11 సెంటీమీటర్లు) కురిసే అవకాశం ఉందని ఈ విభాగం అంచనా వేసింది.

హెచ్చరికలు జారీ

వాతావరణ శాఖ ఝార్సుగుడ, సుందర్‌గడ్, దేవ్‌గడ్, కెంజొహర్, మయూర్‌భంజ్, అంగుల్, ఢెంకనాల్, బాలాసోర్, జాజ్‌పూర్, భద్రక్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, ఖుర్దా, పూరీ, మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగపూర్, నువాపాడా మరియు బర్‌గఢ్ జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కూడిన వర్షం కురుస్తుంది. బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్, ఖుర్దా, పూరీ, గంజాం, కంధమల్, అంగుల్, ఢెంకనాల్, నయాగఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్ మరియు సుందర్‌గడ్ ప్రాంతాల్లో ఈ వాతావరణ పరిస్థితి ఉంటుందని పేర్కొంది. అదేవిధంగా రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని, ఆ తర్వాతి రెండు రోజుల్లో వాతావరణంలో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉందని వాతావరణ సంస్థ తెలిపింది. ఈ వర్షాకాలంలో సెప్టెంబర్ 22 వరకు రాష్ట్రంలో 1,077 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. ఈ వ్యవధిలో రాష్ట్రంలో సాధారణ సగటు వర్షపాతం 1107.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2 జిలాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు కాగా, 25 జిల్లాల్లో సాధారణ వర్షపాతం రికార్డు అయింది. మిగిలిన 3 జిల్లాల్లో మాత్రమే లోటు వర్షపాతం నమోదు అయింది.

10 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన నిందితులు, స్వాధీనం చేసుకున్న నగదు చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగర శివారు సదర్ పోలీసుస్టేషన్ పరిధి కారవిల్లి నగర 3వ లైన్‌లోని ఒక ఇంటిలో కొద్దిరోజులుగా రహస్యంగా పేకాట శిబిరం నడుస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇంటిపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి 10 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. అలాగే వారివద్ద నుంచి రూ.4,25,270 నగదు, 11 సెల్‌ఫోన్లు, 5 పేకకట్టలు స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ అధికారి భూషన్ మహంతి తెలియజేశారు.

ఘోరం..!

- వివాహితపై కామెంట్స్ చేసిన ఆకతాయిలు
- నిలదీయడంతో ముగ్గురిపై మారణాయుధాలతో దాడి
- నలుగురు అరెస్టు




నిందితులు జోగా నాయిక్, సురేంద్ర పొరజ



తరుణ్ కులదీప్



హరిహర పొరజ

జయపురం: ఒక వివాహితను కామెంట్స్ చేసిన ఘటనలో నిలదీసిన ముగ్గురు వ్యక్తులపై ఆకతాయిలు మారణాయుధాలతో దాడిచేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 20వ తేదీ సాయంత్రం బమునిగాం గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటికి వెళ్తుండగా గ్రామంలోని సీతాలమ్మ మందిరం ప్రాంతంలో జయనగర్ గ్రామానికి చెందిన తరుణ్, కులదీప్, ఝింకరగుడ గ్రామానికి చెందిన సాను జానిలు కామెంట్స్ చేశారు. దీంతో ఆమె భయపడి ఇంటికి వెళ్లి, తన సోదరుడు శంకర హరిజన్‌కు విషయం తెలియజేసింది. వెంటనే ఆమె తన సోదరుడుతో కలసి సంఘటన స్థలానికి వెళ్లి, కామెంట్స్ చేసిన వ్యక్తులను నిలదీశారు. అయితే వారిని ఆకతాయిలు తిడుతూ చంపుతామని హెచ్చరించారు. అనంతరం బాధిత యువతి, ఆమె సోదరుడు ఒక హోటల్‌లో టిఫిన్ చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో తరుణ్, కులదీప్, సాను, జానిలు మరికొంత మందితో వచ్చి మారణాయుధాలతో శంకర హరిజన్‌పై దాడి చేశారు. ఈ విషయం తెలియడంతో యువతి మరో సోదరుడు సనంద హరిజన్తో పాటు కజిన్ సోదరుడు గోవింద హరిజన్‌లు అక్కడికి చేరుకున్నారు. అయితే వారిపై కూడా ఆకతాయిలు మారణాయుదాలపై దాడి జరిపారు. వారి దాడిలో గోవింద తీవ్రంగా గాయపడి అచేతనంగా కింద పడ్డాడు. సనంద తలపై బలమైన గాయమైంది. తీవ్రంగా గాయపడిన శంకర్, సనంద, గోవిందలను స్థానికులు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు జయపురం సదర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి, దాడిచేసిన నలుగురు నిందితులను అరెస్టు చేశారు. దాడిచేసిన మరికొంతమంది నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- రాజధానిలో భారీ ధర్నా
- డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు
- ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిక



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభలో శుక్రవారం నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడంతో లోయర్ పీఎంజీ ప్రాంతం ఆందోళనకారుల నినాదాలతో మారుమోగింది. వేతనాల పెంపు, పింఛన్, ఇతర పదవీ విరమణ ప్రయోజనాలతో పాటు 10 ప్రధాన డిమాండ్ల కోసం వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు కదం తొక్కారు. స్థానిక దిగువ పీఎంజీ చౌరస్తా సామూహిక ధర్నాతో దద్దరిల్లింది. డిమాండ్లు నెరవేర్చకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర సంఘం పిలుపు మేరకు...

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యుటీ చెల్లింపు, అంగన్‌వాడీ వర్కర్లకు వేసవి సెలవులు, గాంవ్ (గ్రామ) కల్యాణ్ సమితిల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల మినహాయింపు, ఉపాధ్యాయ హోదా, విరామ ప్రయోజనాలు, రూ.5,000 పింఛన్ తదితర డిమాండ్ల సాధన కోసం అఖిల ఒడిశా అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం శాసన సభ ఆవరణలో రాష్ట్రస్థాయి నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. దీంతో వర్షాకాల సమావేశాలు ప్రారంభమవ్వగానే రాజధానిలోని దిగువ పీఎంజీ వద్ద ఆల్ ఒడిశా అంగన్‌వాడీ లేడీస్ వర్కర్స్ అసోసియేషన్ బ్యానర్ కింద పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నాలో పాల్గొన్నారు. కార్యకర్తలందరికీ ప్రభుత్వ ఉద్యోగి హోదా, సహాయ కార్యకర్తలకు (హెల్పర్) రూ.9 వేలు నెలసరి వేతనం, రూ.5 లక్షల విరామ ప్రయోజనం, నెలవారీ పింఛన్ తమ ప్రధాన డిమాండ్‌లుగా ఆందోళనకారులు తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం అంచెలంచెలుగా ఆందోళన ఉధృతం చేస్తామని వెల్లడించారు.

ప్రభుత్వ చర్యలు శూన్యం

గతేడాది నవంబర్‌లో తాము నిరసన ప్రదర్శన చేశామని, ఫిబ్రవరిలో సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రావడంతో ఆందోళన విరమించామని తెలిపారు. అయితే తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలను నియమిత ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా కార్యకర్తలకు రూ.18 వేలు, సహాయ కార్యకర్తలకు రూ.9 వేలు వేతనంగా నిర్ణయించాలంటున్నారు. రాజకీయ కక్షలతో సస్పెన్షన్‌కు గురైన పలువురిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పదవీ విరమణ పొందిన తర్వాత రూ.5 లక్షల వరకు విరామ ప్రయోజనం కల్పించాలని కోరుతున్నారు. ఇతర రాష్ట్రాలన్నీ జీతాలను పెంచాయని పేర్కొంటూ, ఒడిశా ప్రభుత్వం తమపై ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

విపక్షాలను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

● ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత్ ముదులి



ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: శాసనసభ వర్షాకాల సమావేశాలు పురస్కరించుకుని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన బిజూ జనతా దళ్ ఎమ్మెల్యేల సమావేశం గురువారం జరిగింది. అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్ ప్రశాంత్ ముదులి స్పందించారు. ఒక మహిళ స్పీకర్ కావడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. అందుకే అందరూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సహకరించిన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. విపక్షాల సవాళ్ళు సమర్థంగా ఎదుర్కొంటామని చీఫ్ విప్ అన్నారు. పార్టీకి చెందిన కొత్త, పాత సభ్యులు సకాలంలో సభలో జరిగే వర్షాకాలం సమావేశాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. అభివృద్ధి ప్రధాన శీర్షికగా అధికార పక్షం సభ్యులు పలు ప్రస్తావనలతో ఈ సమావేశంలో పాలుపంచుకుంటారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో తలెత్తే ప్రశ్నలకు సంబంధిత సభ్యులు సమాధానం చెబుతారన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న బైక్ పార్కింగ్ వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న కణపాక మహంతి వీధికి చెందిన మహంతి శ్రీధర్ అలియాస్ ఉదయ్‌ను అదుపులోకి తీసుకుని ఐదుకిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వన్ టౌన్ సీఐ బి.వెంకటరావు శుక్రవారం వివరాలు వెల్లడించారు. బరంపురం నుంచి రాత్రివేళ విజయనగరానికి నిందితుడు గంజాయి తీసుకువచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి మత్తుకు బానిసైన వారికి ఎక్కువ మొత్తానికి విక్రయిస్తున్నాడన్న పక్కా సమాచారంతో నిఘా పెట్టామన్నారు. నిఘాలో పట్టుబడిన నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మృతురాలు దేవి (ఫైల్)

మెంటాడ: మండలంలోని కొండలింగాల వలస పంచాయతీ పరిధి చల్లవానివలస గ్రామానికి చెందిన ఉయ్యాల దేవి(35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం ఆమెకు కడుపునొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించినప్పటికీ తగ్గకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల తరువాత చల్లపేట ఆస్పత్రికి తీసుకువెళ్లారు.చల్లపేటలో ప్రాథమిక చికిత్స అనంతరం గజపతినగరం సీహెచ్ఎస్సీకి మెరుగైన చికిత్సకోసం చల్లపేట వైద్యులు సూచనల మేరకు తరలించడంతో మార్గమధ్యంలోనే మరణించినట్లు సీహెచ్ఎస్సీ వైద్యులు ధ్రువీకరించారు. అయితే మృతదేహాన్ని ఇవ్వమని వైద్యులను బంధువులు కోరగా మృతదేహంపై గాయాలు ఉండడంతో వైద్యులకు అనుమానం వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేశారు. వైద్యుల ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఆస్పత్రికి వచ్చి మృతురాలి తల్లి ఎరకమ్మతో మాట్లాడి కుమార్తె మృతిపట్ల అనుమానాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. అల్లుడు, కూతురు లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని సారాడవలసలో తనవద్దనే ఉంటున్నారని, రెండు రోజుల క్రితం అత్తవారిల్లు చల్లవానివలస వెళ్లారని, ఇంతలోనే ఈఘోరాన్ని చూడాల్సి వస్తుందనుకోలేదని కన్నీటిపర్యంతమైంది. మృతురాలి తల్లి ఎరకమ్మ ఫిర్యాదు మేరకు ఆంద్ర ఎస్సై సిద్ధార్థ అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీమార్గంలో వైద్యుల నడక ప్రయాణం

● అర్ధరాత్రి వెళ్లి గర్భిణికి వైద్య సేవలు

పాచిపెంట: అర్ధరాత్రి వేళ అటవీ మార్గంలో సుమారు రెండు కిలోమీటర్లు వైద్యులు నడిచి వెళ్లి గిరిజన గర్భిణికి సుఖప్రసవం చేయించారు. పాచిపెంట మండలంలోని కర్రివలస పంచాయతీ మూలవలసలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గర్భిణి కొర్ర మిత్ర(22) ఈనెల 16వ తేదీన స్థానిక ఆశ వర్కర్ సహాయంతో పాచిపెంట పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంది. అనంతరం వైద్యుల సూచన మేరకు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఆమె ఎవరికీ చెప్పకుండా స్వగ్రామానికి వచ్చేసింది. గురువారం రాత్రి 9 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు గ్రామంలో ఉన్న ఆశ వర్కర్‌ను సంప్రదించారు. వెంటనే ఆశ వర్కర్ పాచిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరమణకు తెలియజేసింది. దీంతో ఆయన వైద్యసిబ్బందితో కలిసి సుమారు రెండు కిలోమీటర్ల దూరం గ్రామానికి నడిచి వెళ్లి గర్భిణికి సుఖ ప్రసవం చేయించారు. అనంతరం స్థానికుల సహాయంతో తల్లీబిడ్డలను తీసుకువచ్చి ఆటోలో పాచి పెంట పీహెచ్‌సీకి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు.

శుభములివ్వు.. విఘ్నేశ్వర



పర్లాకిమిడి: కాశీనగర్‌లో పూజలందుకుంటున్న గణేశుడు



పర్లాకిమిడి: కాశీనగర్ మార్కెట్‌లో...



పర్లాకిమిడి: శేషశయన ఆకారంలో విఘ్నేశుడు...



జయపురం: మిల్లు వీధిలో...



పర్లాకిమిడి: కాశీనగర్‌లో ఫారెస్టు గేటు వద్ద...



జయపురం: కరణం వీధిలో...

గణపతి నవరాత్రులు అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించి తరించిపోయారు. సాంస్కృతిక కార్యక్రమాలు జోరందుకున్నాయి. కాగా కొన్ని గ్రామాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాలు సైతం జరిగాయి. యువకులు భారీ విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ సందడి చేశారు. మరికొన్నిచోట్ల లడ్డూ వేలంపాట నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: రూశికుల్యా నదిలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం




జయపురం: కాపువీధిలో...



జయపురం: మెయిన్ రోడ్డులో...



జయపురం: నగరంలోని బాలగణపతి పూజా మండపంలో...



పర్లాకిమిడి: కాశీనగర్-గుణుపురం రోడ్డు జంక్షన్‌లో...

స్పీకర్‌గా ప్రమీలా మల్లిక్



స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రమీలా మల్లిక్

● ఏకగ్రీవంగా ఎన్నిక

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ తొలి మహిళా స్పీకర్‌గా బిజూ జనతా దళ్ సీనియర్ నేత ప్రమీలా మల్లిక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయం డిప్యూటీ స్పీకర్ సభలో అధికారికంగా ప్రకటించారు. అనంతరం ప్రమీలా మల్లిక్ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొత్త స్పీకర్‌కు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ప్రతిపక్ష బీజేపీ తరఫున చీఫ్ విప్ మోహన్ మాఝీ, కాంగ్రెస్ ఎమ్మెల్యే పార్టీ నాయకుడు నర్సింహ మిశ్రా శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమీల మూడో స్పీకర్

ప్రస్తుత అసెంబ్లీలో మూడో స్పీకర్‌గా ప్రమీలా మల్లిక్ బాధ్యతలు చేపట్టారు. 2014 సార్వత్రిక ఎన్నికల తర్వాత సూర్య నారాయణ్ పాత్రో స్పీకర్‌గా ఎన్నికయ్యారు. 2022 సంవత్సరం జూన్ నెలలో ఆయన ఈ పదవికి రాజీనామా చేశారు. తర్వాత విక్రమ్ కేశరి అరూఖ్ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించారు. గత మే నెలలో అరూఖ్ రాజీనామా చేసి మంత్రివర్గంలో చేరారు. అప్పటి నుంచి శాసన సభలో స్పీకర్ పదవి ఖాళీగా ఉంది. ఈ స్థానం ప్రమీలా మల్లిక్ ఎన్నికతో భర్తీ అయింది.

సెంచూరియన్‌లో హ్యాకథాన్ పోటీలు ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో హ్యాకథాన్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీకే మహంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఏకధాటిగా 72 గంటల పాటు కొనసాగనున్న హ్యాకథాన్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటాలని పిలుపునిచ్చారు. 51 అంశాలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపేందుకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. బ్లాక్‌చైన్ అండ్ సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ ఎడ్యుకేషన్, ఆటోమేషన్, అగ్రిటెక్, రోబోటిక్స్, డ్రోన్స్ అంశాలకు సంబంధించి హ్యాకథాన్ పోటీలు జరుగుతున్నాయని చెప్పారు.

విద్యార్థులకు జానపద నృత్యాల పోటీలు

పర్లాకిమిడి: స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి జానపద నృత్యాల పోటీలు గురువారం జరిగాయి. పోటీలను రాష్ట్ర ఉపాధ్యాయుల శిక్షణ పరిషత్ (భువనేశ్వర్)మరియు జిల్లా ముఖ్యశిక్షాధికారి ప్రదోష్ కుమార్‌నాయక్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ పోటీలకు ఆదనపు జిల్లా శిక్షాధికారి మనోజ్‌రంజన్ దొళాయి ముఖ్య అతిథిగా విచ్చేయగా, విద్యాలయం ప్రధాన శిక్షాధికారి మోనాలిసా దాస్ స్వాగత ఉపన్యాసం చేశారు. జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ అంపోలు రవి కుమార్ జానపద నృత్యాల ఉద్దేశం వివరించారు. పోటీల్లో ముఖ్యంగా సవర నృత్యం, పల్లె వాతావరణం గీతాలు తదితర అంశాలపై పోటీ జరిగింది. జిల్లాలోని ఏడు సమితి కేంద్రాల నుంచి విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని రాయఘడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ద్వితీయ బహుమతి కె.ఎం.బలియాసాహి, తృతీయ బహుమతి నువాగడ సమితి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. విజేతలకు మనోరంజన్ దొళాయి, అంపోలు రవికుమార్‌లు బహుమతుల ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి పొందిన రాయఘడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమాన్ని విజ్ఞాన ఉపాధ్యాయురాలు సులతా శుభదర్శిని పర్యవేక్షించారు.



పోటీల్లో పాల్గొన్న రాయఘడ విద్యార్థులు



అలరించిన నువాగడ స్కూల్ విద్యార్థులు



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మనోరంజన్ దొళాయి

దసరా ఉత్సవాలకు సన్నద్ధం

● వైభవంగా జరిపేందుకు నిర్ణయం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: నగరంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సభాగృహంలో ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అధ్యక్షతన ఉత్సవాల నిర్వహణ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ప్రతాప్‌కుమార్ పారిడ మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన దసరా ఉత్సవాన్ని ఎప్పటిలాగే ప్రశాంతంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఉత్సవాల్లో ప్రజలు మమేకమవ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ దసరా వేడుకల్లో మా భగవతి, దక్షిణ కాళీ మొదలగు దేవీ పీఠాల్లో అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం పూజలు జరిపించాలని దేవదాయ ధర్మాదాయ విభాగ అధికారులకు సూచించారు. అలాగే ఉత్సవాల్లో పాల్గొనేందుకు అన్ని గ్రామాల దేవతలకు పిలుపునివ్వాలన్నారు. దేవదాయ పరిచాలన విభాగ క్లర్క్ కృష్ణచంద్ర దాస్ దసరా వేడుకల కార్యక్రమ వివరాలను తెలియజేశారు. సమావేశంలో జయపురం దేవదాయ, ధర్మాదాయ అధికారి మరియు జయపురం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతితో సాగుదాం

● ప్రకృతి, సేంద్రియ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
● ఈ ఏడాది జిల్లాలో 90 వేల ఎకరాల్లో చేపట్టాలన్నది లక్ష్యం
● గతేడాది 26 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు
● 26 వేల కిచెన్ గార్డెన్లు నిర్వహణ
● తగ్గుతున్న రసాయన ఎరువు వినియోగం
● పొలం గట్లపై పెరిగిన కూరగాయ పంటల సాగు

సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా.. ఆరోగ్యకర ఆహారం తినకుంటే ఆస్పత్రిపాలు కావాల్సిందే అన్నది వైద్యుల మాట. రసాయనిక అవశేషాలు ఉన్న ఆహారపదార్థాల వల్లే వ్యాధులు వ్యాప్తిచెందుతున్నాయని, ప్రకృతి, సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసిన పంటలను ఆహారంగా వినియోగించాలని సూచిస్తున్నారు. అందుకే.. ప్రభుత్వం ప్రకృతి, సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అవసరమైన ఆహారాన్ని ఉత్పత్తిచేసేలా రైతన్నకు ఆర్థిక ఊతం అందిస్తోంది. ఊరూరా రైతు శిబిరాలు నిర్వహించి ప్రకృతి సాగును, చీడపీడల నివారణకు అవసరమైన కషాయాల తయారీ పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరిస్తోంది. ప్రకృతిపైనే మానవ మనుగడ ఆధారపడి ఉందని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో హితబోధ చేస్తోంది. కిచెన్‌గార్డెన్ల నిర్వహణను ప్రోత్సహిస్తోంది.





పత్తి సాగులో రైతులు

చిత్రంలో జీవామృతాన్ని తయారు చేస్తున్న మహిళా రైతు పేరు ఉషారాణి. సీతంపేట మండలం తొత్తడి గ్రామం. మూడేళ్లగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది వరి 50 సెంట్లలో సాగుచేశారు. ఎకరన్నర కొండపోడు భూమిలో జీడి, మామిడి, పుసుపు, పైనాపిల్, కంది, గోరుచిక్కుడు, బీర, చిరుధాన్యాల పంటలు వేశారు. చీడపీడల నివారణకు అవసరమైన అన్నిరకాల కషాయాలను సొంతంగా తయారు చేసుకుంటున్నారు. అన్ని పంటలు కలిపి ఏడాదికి దాదాపు రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుందని ఆమె తెలిపారు. ఆరోగ్యకర పంటలు కావడంతో గిట్టుబాటు ధర లభిస్తోందన్నారు.



సీతంపేట:

ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటల సాగుకు పెట్టుబడి తక్కువ. లాభాలు ఎక్కువ. ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు చేతికి అందుతాయి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుంది. ప్రజారోగ్యానికి అవసరమైన ఆహార ఉత్పత్తే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే పద్ధతులను రైతుల దరికి చేర్చుతోంది. వాస్తవంగా హరిత విప్లవంతో రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది. మొదట్లో మంచి ఉత్పాదకత సాధ్యమైనా... రానురాను మోతాదుకు మించి వినియోగిస్తున్న రసాయనిక ఎరువులతో భూమి నిస్సారంగా మారింది. దిగుబడులు తగ్గడంతో పాటు ఆహార ఉత్పత్తుల్లో రసాయిన అవశేషాలు ఉన్నట్టు శాస్త్రీయంగా నిర్ధారణ అయ్యింది. ఈ పరిస్థితుల నుంచి బయట పడడానికి, రైతుకు పంట గిట్టుబాటయ్యేందుకు ప్రకృతి వ్యవసాయం ఒక్కటే సరైన మార్గమన్నది వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల అభిప్రాయం. ప్రభుత్వ ఆదేశాల మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ ఏడాది 50 వేల మంది రైతులతో 90వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేయించాలని లక్ష్యం విధించారు. గత సంవత్సరం 36 వేల మంది రైతులతో 26 వేల ఎకరాల్లో సేద్యం చేశారు. దేశవాళీ ఆవుల మూత్రం, పేడ ఉపయోగించి ఘన, ద్రవ జీవామృతం తయారీ, చీడపీడలు నివారణకు అవసరమైన కషాయాల తయారీపై ఊరూరా రైతులకు ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు.

తగ్గుతున్న ఎరువు వినియోగం	
సంవత్సరం	రసాయనిక ఎరువుల వినియోగం
2021–22	2లక్షల టన్నులు
2022–23	లక్షా 50వేల టన్నులు

● 26 వేల కిచెన్ గార్డెన్‌లు

గ్రామైక్య సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో రైతు సాధికార సంస్థ ప్రకృతి వ్యవసాయ విభాగం సెర్ప్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని 361 ఆర్‌బీకే కేంద్రాలకు 175 ఆర్‌బీకేల పరిధిలో 26 వేల మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపులతో 26 వేల కిచెన్‌గార్డెన్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సెంటు నుంచి 10 సెంట్ల స్థలంలో పెరటితోటలను అభివృద్ధి చేస్తున్నారు. ఏడాది పొడవునా పంట చేతికందేలా ఐదు అంతస్తుల విధానంలో తీగజాతి కూరగాయలు, దుంపజాతి, జామ, మునగ, బొప్పాయి, అరటి, మామిడి వంటి పంటల సాగును ప్రోత్సాహిస్తున్నారు. దీనికోసం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులను ఖర్చు చేస్తున్నారు.



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన కూరగాయల విక్రయం (ఫైల్)



ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగులో ఉన్న వరి

ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ

ప్రకృతి వ్యవసాయానికి ఆదరణ పెరుగుతోంది. రసాయన అవశేషాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా ప్రజలు అనేక వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసిన ఆహార ఉత్పత్తులు ఆరోగ్యదాయకం. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాలు సాధించే దిశగా 'సాగు'తున్నాం.

– షణ్ముఖరాజు, డీపీఎం, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం

మంచి దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై మన్యం రైతులు మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వం కూడా సహకరిస్తోంది. ఎకరా విస్తీర్ణంలో వరి పంట సాగుచేశాను. పంట సాగుకు ముందే నవధాన్యాలతో భూమిని సారవంతం చేశాను. పంటను చీడపీడలు ఆశించకుంగా ఘన, ద్రవ జీవామృతాలను పిచికారీ చేస్తున్నాం. పత్తిపంటలో అంతర పంటలు సాగుచేస్తున్నాను. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువ.

– జగన్‌మోహన్‌రావు, దారిమల్లి, రైతు



గట్లపై కూరగాయల మొక్కలు పెంచుతున్న రైతులు

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి రగ్బీ ఎంపికలు రేపు

టెక్కలి: జిల్లా స్థాయి రగ్బీ క్రీడాకారుల ఎంపికలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.గోవిందరాజు, ప్రధాన కార్యదర్శి పి.పార్వతీశం, కోశాధికారి డి.రామకృష్ణ, నిర్వాహక కార్యదర్శి బి.నారాయణరావు తదితరులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-18 విభాగంలో బాల బాలికలకు నిర్వహిస్తున్న ఎంపికల్లో భాగంగా 2005-2007 మధ్యలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఎంపికలకు హాజరు కావాలని వెల్లడించారు. ఈ జట్టులో ఎంపికైన వారు అక్టోబర్ నెలలో కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8500007272 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బంతి మొక్కల వితరణ



కేవీకేలో బంతి మొక్కలు అందిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డీవీ విద్యాసాగర్ రైతులకు శుక్రవారం బంతి మొక్కలు వితరణగా అందజేశారు. కేవీకే, జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఈ మొక్కలను వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, శ్రీకాకుళం ఎల్‌హెచ్‌డీపీ ఎంబీ నారాయణరావు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏపీఎం ఈశ్వరరావు, కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ నీలవేణి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) ద్వారా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశం పొందే అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఎలాంటి విద్యార్హత లేకపోయినా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరవచ్చన్నారు. వివిధ కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారితోపాటు గృహిణులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, ఆయాలు, ఆశ వర్కర్లు, ఇలా ఎవరైనా ఓపెన్ స్కూల్ ద్వారా చేరవచ్చని డీఈఓ తెలిపారు. టెన్త్‌లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు పూర్తయ్యి ఉంటే సరిపోతుందన్నారు. ఇంటర్‌లో చేరే వ్యక్తులు టెన్త్ ఉత్తీర్ణులైతే సరిపోతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు/అభ్యర్థులు వెంటనే సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రంలో దరఖాస్తు సమర్పించి మీసేవా/ఏపీ ఆన్‌లైన్ ద్వారా నిర్ణీత ఫీజును చెల్లించాలని సూచించారు.

చెరువుల్లో గంబూషియా చేపల విడుదల



అలుదు చెరువులో గంబూషియా చేపలు విడుదల చేస్తున్న జిల్లా మలేరియా అధికారి సత్యానారాయణ

సారవకోట: మలేరియా నిర్మూలనలో భాగంగా దోమల ఉత్పత్తిని నియంత్రించేందుకు జిల్లావ్యాప్తంగా పలు చెరువుల్లో 8 లక్షల గంబూషియా చేపలను విడుదల చేయనున్నట్లు జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం మండలంలోని అలుదు గ్రామంలోని బందరువాని చెరువు, సారవకోటలోని శివరామపాత్రుని కోనేరు, అర్లి సమీపంలోని రంగసాగరంలో ఈ గంబూషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తొలి విడతలో 12 మండలాల్లో 4 లక్షల గంబూషియా చేపలను విడుదల చేశామని, ప్రస్తుతం రెండు విడతల్లో 4 లక్షల చేపలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ చేపలు చెరువుల్లోని దోమల లార్వాలను నాశనం చేస్తాయని తెలిపారు. అలాగే ప్రతి వసతి గృహంలో ఐఆర్‌ఎస్ స్ప్రేని పిచికారీ చేయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 10 మలేరియా కేసులు, 30 డెంగీ కేసులు నమోదైనట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీఓ ఆర్ రాంబాబు, అసిస్టెంట్ మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వైకె శ్రీనివాస్, స్థానిక వైద్యులు సౌమ్య, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పలాస విద్యార్థిని

కాశీబుగ్గ: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన శిష్టు ప్రియమణి ఎంపికైంది. ఈ నెల 30వ తేదీ నుంచి నంద్యాలలో జరగనున్న సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా శుక్రవారం విద్యా వాహిణి కళాశాలలో విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విధి రాతను ఎదురించి..

విశ్వ వేదికపై నిలిచి..

అతడికి కాళ్లు లేవు.. కానీ కలలు ఉన్నాయి. ఆ కుర్రాడికి కదలడానికి శక్తి లేదు.. అయితేనేం ఎదగాలనే కాంక్ష ఉంది. యువకుడి చుట్టూ కష్టాల చీకట్లు అలముకున్నాయి.. మరేం కాదు రేపటి వెలుగు కోసం వెతకడం అతడికి తెలుసు. రోడ్డు ప్రమాదంలో కాళ్లు పోగొట్టుకుని కన్నీళ్లు పెట్టిన దశ నుంచి విశ్వ వేదికపై మువ్వన్నెల జెండా పట్టుకుని గర్వంగా ఆనంద భాష్పాలు రాల్చినంత వరకు పూర్ణారావు చేసిన ప్రయాణం సాధారణమైనది కాదు. ఒక్క రోడ్డు ప్రమాదం తన బతుకును మార్చేస్తే.. ఆ మార్పును తన కొత్త ప్రస్థానానికి దేవుడిచ్చిన తీర్పుగా చేసుకున్న నేర్పరి అతడు.





మైసూర్‌లో పారా బ్యాడ్మింటన్ సాధన చేస్తున్న పూర్ణారావు (ఫైల్) (ఇన్‌సెట్లో) ఇండోనేషియాలో పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సాధించిన పతకాలతో క్రీడాకారుడు చాపరా పూర్ణారావు

- ఇంటర్నేషనల్ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపిన దివ్యాంగుడు
- కదల్లేని స్థితి నుంచి పతకాలు సాధించే స్థాయి వరకు అపూర్వ ప్రస్థానం
- ఆర్థిక సాయం అందిస్తే ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఆకాంక్ష
- స్ఫూర్తిదాయకంగా పూర్ణారావు క్రీడా ప్రయాణం

టెక్కలి: ఇండోనేషియాలో ఈ నెల 5నుంచి 10వ తేదీ వరకు జరిగిన ఇంటర్నేషనల్ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఓ సిక్కోలు కుర్రాడు మిక్స్‌డ్ డబుల్స్‌లో సిల్వర్, డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఇంత ఘనత సాధించిన ఆ క్రీడాకారుడికి రెండు కాళ్లు పనిచేయవు. అది కూడా పుట్టుకతో కాదు. అందరిలాగానే బాల్యంలో సరదాగా గడిపి, చక్కగా చదువుకుని, విదేశంలో ఓ ఉద్యోగం వెతుక్కుని కుటుంబాన్ని పోషించేంత వరకు అతను అందరిలాంటి వాడే. కానీ ఓ రోడ్డు ప్రమాదం అతడిని దివ్యాంగుడిని చేసింది. పరిపూర్ణంగా చెప్పాలంటే రోడ్డు ప్రమాదానికి ముందు పూర్ణారావు వేరు. ప్రమాదం తర్వాత పూర్ణారావు వేరు.

టెక్కలి మండలం శ్రీరంగం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన చాపరా లక్ష్మణరావు, మోహిని దంపతుల చిన్న కుమారుడు చాపరా పూర్ణారావు. పూర్ణారావు ఇంటర్ పూర్తి చేసి 2015 సంవత్సరంలో సింగపూర్‌లో ఫైర్ సేఫ్టీలో ఉద్యోగంలో చేరాడు. తన తల్లిదండ్రులను చూసేందుకు 2017 సంవత్సరంలో సొంత గ్రామం వచ్చాడు. మరో రెండు రోజుల్లో సింగపూర్ వెళ్లిపోతున్న తరుణంలో వజ్రపుకొత్తూరు మండలం పూండి సమీపంలో ద్విచక్రవాహనంతో ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో వెన్నుపూసకు తీవ్రంగా గాయం కావడంతో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. ఆ ప్రమాదం పూర్ణారావు బతుకులో చీకట్లు నింపింది. 2020 వరకు ఇంటిలో మంచానికే పరిమితమయ్యాడు. చిన్నపాటి పాన్‌షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తల్లిదండ్రులకు పూర్ణారావు పరిస్థితి మరింత ఆవేదనకు గురి చేసింది.



తాను సాధించిన పతకాలు, ప్రశంసా పత్రాలతో టెక్కలి మండలం శ్రీరంగం గ్రామంలో తల్లిదండ్రులతో పారా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పూర్ణారావు

ఫేస్‌బుక్ ద్వారా తెలుసుకుని..

అప్పుడే ఫేస్‌బుక్‌లో బెంగళూరులో గల దివ్యాంగుల పునరావాస కేంద్రం గురించి పూర్ణారావు తెలుసుకున్నాడు. స్నేహితుల ఆర్థిక సహకారంతో బెంగళూరులో గల దివ్యాంగుల పునరావాస కేంద్రంలో చేరాడు. అక్కడ మనోధైర్యంపై నేర్చుకున్న అంశాలు అతడిని ఒక లక్ష్యానికి దగ్గర చేశాయి. ఈ క్రమంలో పారా బ్యాడ్మింటన్‌పై ఆసక్తి కలిగింది. యూట్యూబ్‌లో వీడియోలను చూస్తూ సొంతంగా శిక్షణ నేర్చుకున్నాడు. తోటి మిత్రులతో కలిసి ప్రతి రోజూ సాధన చేసేవాడు.

తొలి ఆటలోనే..

2020 లో కర్ణాటకలో జరిగిన రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పూర్ణారావు మొట్టమొదటిగా పాల్గొని గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించాడు. దీంతో అతని పట్టుదలకు మెడల్స్ మరింత ప్రోత్సాహాన్నిచ్చాయి. ఆ తర్వాత భువనేశ్వర్‌లో జరిగిన నాల్గో నేషనల్ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పాల్గొన్నప్పటికీ ఎలాంటి మెడల్స్ రాలేదు. దీంతో కొంత నిరాశ చెందినప్పటికీ, పూర్ణారావు ఆటను కోచ్ ఆనంద్‌కుమార్ గమనించారు. దీంతో మైసూర్‌లో 2 నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత లక్నోలో జరిగిన ఐదో నేషనల్ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని క్వార్టర్స్ ఫైనల్ వరకు వెళ్లాడు. 2023 జూలై నెలలో యుగాండాలో జరిగిన ఇంటర్నేషనల్ పారా బ్యాడ్మింటన్ పోటీలకు సిద్ధమైనప్పటికీ పాస్ పోర్టు సక్రమంగా లేదని ఎయిర్‌పోర్టులోనే ఆపివేశారు. దీంతో పూర్ణారావు ఎంతో నిరాశకు తిరిగి వచ్చేశాడు.

పారా ఒలింపిక్సే లక్ష్యం

నాకు ఆర్థిక సాయం అందితే పారా ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. మరి కొద్ది రోజుల్లో ఖేలో ఇండియా టోర్నమెంట్‌తో పాటు జపాన్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నా.

– చాపరా పూర్ణారావు

మెడల్స్‌తో ఉత్సాహం

తాజాగా సెప్టెంబర్ 5 నుంచి 10 తేదీలలో ఇండోనేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పూర్ణారావు పాల్గొని మిక్స్‌డ్ డబుల్స్‌లో సిల్వర్, డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ సాధించడంతో కొత్త ఉత్సాహం వచ్చింది. అతను ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌ను సాధించాడు. కర్ణాటక ఓపెన్ స్టేట్ టోర్నమెంట్‌లో 2 సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్ సాధించాడు. 2002లో విశాఖపట్టణంలో జరిగిన టోర్నమెంట్‌లో 2 గోల్డ్ మెడల్స్ సాధించాడు. 2023 లో విశాఖపట్టణంలో జరిగిన టోర్నమెంట్‌లో 1 గోల్డ్ మెడల్ సాధించాడు. వీటితో పాటు 2023 మార్చి నెలలో విశాఖపట్టణంలో జరిగిన ఏపీ నేషనల్ ట్రయల్స్ టోర్నమెంట్‌లో 1 గోల్డ్ మెడల్ సాధించాడు.

నేడు 5కే రన్



అరసవల్లి: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడానికి వీలుగా జిల్లా కేంద్రంలో యూత్ ఫెస్ట్ 5కె రన్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి తెలిపారు. శ్రీకాకుళంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో యూత్ ఫెస్ట్ 5కె రెడ్ ఆన్ మారథాన్-2023 నిర్వహణపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి అరసవల్లి కూడలి వరకు శనివారం 5కె రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారథాన్‌లో 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచి వారికి నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యాల య పనివేళల్లో వివరాలు నమోదు చేసుకోవాలని అన్నా రు. ఇతర సమాచారం కోసం 9494474266 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

డిగ్రీ మూల్యాంకనం నిధుల విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన డిగ్రీ మూల్యాంకనం రుసుం నిధులు విడుదల చేసినట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నిర్వహించిన డిగ్రీ 1, 3, 5, 6 సెమిస్టర్లకు సంబంధించి నిధులు రూ.57.78 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. శిబిరాల నిర్వహణ ఇన్‌చార్జిల ఖాతాల్లో నగదు జమ అవుతుందని అన్నారు. శ్రీకాకుళం పట్టణంలో మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం రూరల్ మండలం గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్స్, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజాం జీసీఎస్ఆర్ డిగ్రీ కళాశాలల్లో శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులపై వివక్ష చూపితే చర్యలు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులపై ఎవరైనా వివక్ష చూపితే చర్యలు తప్పవని ఇన్‌చార్జి కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. వారి సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, చట్టాలు, హక్కులపై వారు అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. విభిన్న ప్రతిభావంతుల చట్టం, ఆంధ్రప్రదేశ్-2016లోని పలు అంశాలపై నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమిటీతో జిల్లా వయోవృద్ధులు, హిజ్రాలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డు, ఆధార్ అనుసంధానంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులకు పెన్షన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్రైసైకిళ్లను ప్రభుత్వం అందిస్తోందని, అర్హులకు బ్యాంకు రుణాలు అందిస్తోందని పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఓసారి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. వ్యాపారాలకు బ్యాంకు రుణాలను మంజూరు చేస్తామని లీడ్ బ్యాంక్ ఏజీఎం జి.సూర్యారావు తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఎల్. విద్యాసాగర్, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, మెప్మా పీడి కిరణ్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనురాధ, డీసీహెచ్ఎస్ భాస్కరరావు, జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పిద్దాం: ఎస్పీ



సీసీ కెమెరాలు తిలకిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

కంచిలి: రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం కంచిలి పోలీస్‌స్టేషన్‌ను ఆమె తనిఖీ చేశారు. ఇందులో పెండింగ్, విచారణలో ఉన్న కేసు ఫైల్స్‌ను పరిశీలించారు. దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలని చెప్పారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలు, శుభ్రతను పరిశీలించారు. దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు, రాత్రి గస్తీలు పెంచాలన్నారు. మహిళల నేరాల్లో సత్వరమే స్పందించాలని తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడిన కేసు ప్రాపర్టీ వాహనాలను పరిశీలించారు. అదే విధంగా పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం, సీసీ కెమెరాలను ఎస్పీ ప్రారంభించారు. ఈ తనిఖీలో కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సోంపేట సిఐ రవిప్రసాద్, స్థానిక ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు.

• కాఫీ విత్ క్లాప్ మిత్ర



సీతారాంపల్లిలో పంచాయతీ సిబ్బందితో కాఫీ తాగుతున్న డీపీఓ రవికుమార్, డీఎల్‌పీఓ రమణ

పాతపట్నం: పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో కలిపి జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్ కాఫీ తాగారు. 'కాఫీ విత్ క్లాప్ మిత్ర' పేరుతో ఆయన చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పిస్తూ సిబ్బందిని చైతన్యపరుస్తున్నారు. అందులో భాగంగా సీతారాంపల్లి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద పంచాయతీ సిబ్బంది, అధికారులతో కలిసి శుక్రవారం ఉదయం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బందితో కాఫీ తాగడం ఆనందంగా ఉందని డీపీఓ అన్నారు. కార్యక్రమంలో టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఐవీ రమణ, ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్, ఈవోపీర్డీ టి క్రిష్ణారావు,సీతారాంపల్లి సర్పంచ్ ధర్మాన కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సవిరిగాన శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహతి రజతోత్సవం



పైడి హరనాథరావును సత్కరిస్తున్న మహతి సంస్థ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరంలో మహతి సంస్థ రజతోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం అధ్యక్షుడు గుమ్మానగేష్ ముఖ్య అతిథిగా పాల్గొని సంస్థ సేవలను గుర్తు చేశారు. అనంతరం ప్రముఖ అష్టావధాని పైడి హరనాథరావును సత్కరించారు. ఆ తర్వాత 'ప్రవరుని వ్యక్తిత్వ వికాసం' అనే అంశంపై హరనాథరావు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, పీఎస్ఎస్ ప్రసాద్, సనపల నారాయణమూర్తి, నిష్టల నర్సింహమూర్తి, వి.కామేశ్వరరావు, పిలకా శాంతమ్మ, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మత్స్యకారుల సమస్యలపై చర్చ



గిరిజన మత్స్యకారుల సమస్యలపై చర్చిస్తున్న మత్స్యశాఖాధికారులు

సారవకోట: గిరిజన మత్స్యకారుల సమస్యలపై బుడితి గ్రామంలోని సచివాలయంలో మత్స్య శాఖ అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల బొంతు పీహెచ్‌సీ ఆవరణలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుడితి గ్రామానికి చెందిన గిరిజన మత్స్యకారులు వారి సమస్యలను విన్నవించారు. దీనిపై ఐటీడీఏ పీఓ సూచన మేరకు మత్స్యశాఖాధికారులు శుక్రవారం గిరిజన మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి చేపల వేటకు కావాల్సిన వస్తువులు, అలాగే పట్టిన చేపలు విక్రయించుకునేందుకు కావాల్సిన వస్తువులపై సమావేశం నిర్వహించారు. దీనిపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ఐటీడీఏ పీఓకు అందజేయనున్నట్లు మత్స్య శాఖ జేడీ పీవీ సత్యనారాయణ తెలిపారు. ఆయనతో పాటు పలాస, శ్రీకాకుళం డివిజన్ల ఏడీలు వై.సత్యనారాయణ, టి.సంతోష్, ఎఫ్‌డీఓ సురేష్ కుమార్, సారవకోట ఫిషరీస్ అసిస్టెంట్ వెంకటేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నక్క తులసీదాస్, నిక్కు రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

'విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం'



జీపు జాతాకు స్వాగతం పలుకుతున్న ఏపీ మహిళా సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం అమ్మకుండా మనమే కాపాడుకోవాలని సీపీఎం రాష్ట్ర నాయకులు కొత్తపల్లి లోకనాథం అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై-ఉక్కు రక్షణ యాత్ర పేరిట చేపట్టిన జీపు జాతా శుక్రవారం నరసన్నపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సీఐటీయూ ప్రతినిధులు, ఏపీ మహిళా సంఘం ప్రతినిధులు జీపు జాతా ప్రతినిధులకు స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొత్తపల్లి లోకనాథం మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో పాటు అనేక విభజన హామీలను తుంగలోకి తొక్కి కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ఉద్యమాల ద్వారానే కాపాడుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధి ఆర్.సురేష్ బాబు, కాల నరసింహులు, మహిళా సంఘం ప్రతినిధులు ఆర్.స్వప్న, రైతు సంఘం నాయకులు కె.కొండయ్య,కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగి గన్నయ్య లతో పాటు పలువురు పాల్గొన్నారు.

రైలు ప్రమాదం మృతుడి వివరాలు లభ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో బుధవారం రైలు ఢీకొని చనిపోయిన వ్యక్తిని ఇచ్ఛాపురం వాసిగా గుర్తించినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. పట్టణంలోని కస్పావీధికి చెందిన బుల్లు మహంతి(33) మూడు రోజులుగా ఇంటికి వెళ్లలేదు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొట్టి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడ నే వార్త బయటకు రావడంతో కుటుంబ సభ్యులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి గుర్తు పట్టారని ఎస్ఐ తెలిపారు. శుక్రవారం పలాస ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పంట లెక్క.. ఇక పక్కా!



ముండ్ల గ్రామంలో రైతుకు ఫొటో తీసి, వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

- నూతన విధానంతో పంటల నమోదు ప్రక్రియ
- ఈ-క్రాప్ బుకింగ్‌లో కొత్త విధానం
- క్షేత్రస్థాయికి వెళ్తేనే ఓపెన్ కానున్న సర్వే నంబర్
- జిల్లాలో త్వరితగతిన పంటల నమోదు

కంచిలి: జిల్లాలో పంటల లెక్క ఇక పక్కాగా జరగనుంది. రైతులకు ప్రభుత్వ రాయితీలు, సంక్షేమాలు అందజేసేందుకు ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియను మరింత సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కొత్త పద్ధతి ప్రవేశపెట్టింది. ఈ-కర్షక్ యాప్‌లో కొత్త మాడ్యూల్ ఏర్పాటు చేశారు. ఈ విధానం వల్ల మరింత పారదర్శకంగా అన్ని రకాల పంటల నమోదు జరిగి, ప్రభుత్వ పరంగా చేపడుతున్న వివిధ సేవలు మరింత పకడ్బందీగా చేరుతాయి.

జిల్లా వ్యాప్తంగా 4,42,775 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానశాఖల పరిధిలో వివిధ రకాల పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో ఇప్పటి వరకు 3,96,953 ఎకరాల్లో ఈ క్రాప్ నమో దు చేశారు. ఈ నెల 30వ తేదీతో వ్యవసాయ శాఖ పరిధిలో పంటలకు ఈ క్రాప్ నమోదుకు గడువు పూర్తవుతుంది. ఆలోగా రైతులందరికీ ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు.

గతంలో ఇలా..

- గతంలో ఏయే సర్వే నంబర్లలో రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారో వ్యవసాయ విస్తరణాధికారి నమోదు చేసి, వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేవారు.
- గతంలో కూడా ఈ-క్రాప్ బుకింగ్ చేసే విధానంలో యాప్‌లో సర్వే నంబర్ నమోదు చేసి, ఏదో ఒక పొలం వద్ద రైతును నిలబెట్టి ఫొటో తీసేవారు.
- అలాగే గ్రామంలోని పెద్ద రైతుల నుంచి సమాచారం తీసుకోవడం, లేదా రైతు చెప్పింది మాత్రం నమోదు చేయడం చేసేవారు.
- దీంతో వివిధ రకాల పంటలు ఏ మేరకు సాగవుతున్నాయో పూర్తిస్థాయిలో స్పష్టత ఉండటం లేదని ప్రభుత్వం గుర్తించింది.
- దీంతో ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.
- గ్రామ వ్యవసాయ సహాయకుల ట్యాబ్‌లో నూతన సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసి, దాని సహాయంతో ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు.
- నూతన విధానంలో గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుంది.

జియోఫెన్సింగ్‌తో అనుసంధానం..

గ్రామ వ్యవసాయ సహాయకులకు ఈ-కర్షక్ యాప్ జియోఫెన్సింగ్‌తో అనుసంధానమై ఉంటుంది. ఇప్పటి వరకు ఉపయోగిస్తున్న ట్యాబ్‌లో అటెండెన్స్‌తో పాటు రోజువారీ విధుల వివరాలు, రైతు భీమా, రైతు బంధు అప్‌డేట్ నమోదు చేసేవారు. ఇందులోనే ఈ-క్రాప్ బుకింగ్ చేసేవారు. అయితే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే పంటల వివరాలు నమోదు చేసేలా ఇది ఉండేది. ఈ క్రమంలో ప్రభుత్వం కొత్త మార్పులు చేసింది. సంబంధిత సర్వే నంబర్ పొలానికి వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కనిపించేలా మాడ్యూల్ రూపొందించింది. సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు గూగుల్ జియోఫెన్స్ ద్వారా ఆ లొకేషన్‌కు చేరుకుంటారు. 200 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు మాత్రమే సర్వే నంబర్ వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. అప్పుడే నమోదు చేయాల్సి ఉంటుంది.

త్వరితగతిన నమోదు

సోంపేట, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, రణస్థలం, కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్లలో 30 మండలాల్లో ఈ ప్రక్రియ త్వరితగతిన చేస్తున్నారు. ఆయా మండలాల్లో మండల వ్యవసాయాధికారులు నూతన విధానంలో సర్వే నంబర్లను వెబ్‌ల్యాండ్ నుంచి డౌన్‌లోడ్ చేసి, గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులకు కేటాయిస్తారు. ఆ సర్వే నంబర్లను గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ-కర్షక్ వెబ్ లాగిన్‌లో అప్‌డేట్ చేసుకుంటారు. అనంతరం ఈ-కర్షక్ మొబైల్ యాప్‌లో జియోఫెన్సింగ్ డౌన్‌లోడ్ చేసుకొని పంట నమోదు ప్రక్రియను ప్రారంభిస్తారు. ఒక సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు ఆ సర్వే నంబర్ జియో కో-ఆర్డినేట్స్ ఓపెన్ అవుతాయి. సర్వే కోసం వ్యవసాయ సహాయకులు క్షేత్రస్థాయి సర్వే నంబర్‌కు వెళ్తేనే యాప్ ఓపెన్ అవుతుంది. వివరాలు నమోదు చేయగానే అప్పుడు సర్వే నంబర్ ఎరుపు నుంచి పసుపు పచ్చ రంగుకు మారుతుంది. అప్పుడు మాత్రమే వివరాలు నమోదైనట్లు పరిగణిస్తారు.